సాక్షి నల్లగొండ

శుక్రవారం । 28 । జూలై । 2023



పక్కా ప్రణాళికతోనే చోరీ

నార్కట్‌పల్లిలో ఓ హోటల్ వద్ద ప్రైవేట్ బస్సులో రూ.28లక్షలు చోరీ పక్కా ప్రణాళికతో జరిగినట్టు తెలుస్తోంది. - 8లో



ప్రపంచానికి చాటిచెబుతా

బుద్ధవనం ప్రాధాన్యతను ప్రపంచానికి చాటిచెబుతానని బాలీవుడ్ నటుడు గగన్‌మాలిక్ అన్నారు. - 8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 29°/24°

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు విద్యా సంస్థలకు సెలవు

నల్లగొండ: భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రభుత్వం శుక్రవారం కూడా విద్యా సంస్థలకు సెలవు ప్రకటించింది. భారత వాతావరణ శాఖ నల్లగొండ జిల్లాతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని గంటల్లో అతి ఎక్కువ వర్షం కురిసే అవకాశం ఉందని చెప్పడంతో ప్రభుత్వం పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఈ మేరకు జిల్లా విద్యా శాఖ అధికారి భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు.

నల్లగొండ డీపీఆర్‌ఓ బదిలీ

- కొత్త డీపీఆర్‌ఓగా వెంకటేశ్వర్‌రావు

నల్లగొండ: నల్లగొండ డీపీఆర్‌ఓగా పనిచేస్తున్న శ్రీనివాస్‌ను భువనగిరి జిల్లాకు బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న పి.వెంకటేశ్వర్‌రావును నల్లగొండకు బదిలీ చేశారు. దీంతో గురువారం సాయంత్రం పీవీ రావు నల్లగొండ డీపీఆర్‌ఓగా బాధ్యతలు స్వీకరించారు.

తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా ఉద్యోగోన్నతి

నల్లగొండ: ప్రభుత్వం తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా ఉద్యోగోన్నతి కల్పించింది. రాష్ట్ర వ్యాప్తంగా 81 మందికి ఉద్యోగోన్నతి కల్పించగా ఇందులో జిల్లాకు చెందిన ఆరుగురికి లభించింది. ఉద్యోగోన్నతి పొందిన తహసీల్దార్లలో మాలె కృష్ణారెడ్డి (మునుగోడు), అర్చన (చండూరు), జీఎస్‌వీ.రాజు(దేవరకొండ), శ్రీనివాస్‌రెడ్డి (శాలిగౌరారం), పులి సైదులు (నార్కట్‌పల్లి), గణేష్ (దామరచర్ల) ఉన్నారు.

మూసీని సందర్శించిన అధికారులు



దిగువకు వెళ్తున్న నీటిని పరిశీలిస్తున్న నల్లగొండ ఆర్డీఓ రవి తదితరులు

కేతేపల్లి: నల్లగొండ ఆర్డీఓ ఎస్. రవి, ఐబీ సూర్యాపేట డివిజన్ చీఫ్ ఇంజనీర్ రమేష్ గురువారం మూసీ ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టులోకి వస్తున్న ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో, ప్రస్తుతం నీటిమట్టం, ఆయకట్టు పరిధిలో సాగయ్యే భూములు వివరాలను ప్రాజెక్టు అధికారులను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. వారి వెంట ఎస్‌ఈ శివధర్మ తేజ, ఈఈ భద్రునాయక్, కేతేపల్లి తహసీల్దార్ ఎస్. మధుసూదన్‌రెడ్డి, మూసీ డీఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈ ఉదయ్‌కుమార్ ఉన్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలో భారీ వర్షాలకు ఏదైనా ఇబ్బందులు ఏర్పడితే సహాయక చర్యల కోసం మున్సిపాలిటీ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కేవీ.రమణాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహాయం కోసం టోల్‌ఫ్రీ నంబర్ 14420, ల్యాండ్‌లైన్ నంబర్ 08682–220100 సంప్రదించాలని కోరారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న కనగల్ కత్వ



శాలిగౌరారంలో విరిగిపడిన స్తంభం

వాగుల ఉధృతి

- బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు 36 మి.మీ. సగటు వర్షపాతం
- రాత్రి వరకు కాస్త తెరిపిచ్చిన వరుణుడు
- ఏడు మండలాల్లో అత్యధికంగా..
- 12 మండలాల్లో సాధారణ.. ఆరు చోట్ల లోటు
- శాలిగౌరారం మండలంలో అత్యధికంగా 8.6 సెంటీమీటర్లు నమోదు



శాలిగౌరారం మండల పరిధిలో ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీనది

నల్లగొండ అగ్రికల్చర్: ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో వారం రోజులుగా ముసురుతో కూడిన వర్షం కురుస్తోంది. దీంట్లో భాగంగా జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు అన్ని మండలాల్లో విస్తారంగా వర్షం కురిసి 36.0 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. పలు ప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. చెరువులు, కుంటల్లో కొద్దికొద్దిగా వరదనీరు చేరుతోంది. ఈక్రమంలో చిన్న చెరువులు, వాగులు, కుంటలు అలుగులు పోస్తుండగా రైతులు వరినాట్లు వేసేపనుల్లో నిమగ్నమయ్యారు. గురువారం ఉదయం నుంచి మాత్రం రాత్రి వరకు ఎలాంటి వర్షం పడలేదు. కానీ వాగుల ఉధృతి కొనసాగుతోంది.

అత్యధికంగా ఏడు మండలాల్లో..

జిల్లాలో ఉపరితల ఆవర్తనం కారణంగా వారం రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో జిల్లాలోని నార్కట్‌పల్లి, శాలిగౌరారం నకిరేకల్, కనగల్, మర్రిగూడ, చింతపల్లి, నాంపల్లి సాధారణ వర్షం కంటే అత్యధికంగా వర్షం కురిసింది. అలాగే చిట్యాల, కట్టంగూర్, కేతేపల్లి, తిప్పర్తి, మునుగోడు, గుర్రంపోడు, మాడుగులపల్లి మండలాల్లో మాత్రం సాధారణ కంటే అధిక వర్షం కురిసింది.

12 మండలాల్లో సాధారణం

నల్లగొండ, చండూరు, అనుములహాలియా, నిడమనూరు, త్రిపురారం, దామరచర్ల, అడవిదేవులపల్లి, పీఏపల్లి, కొండమల్లెపల్లి, దేవరకొండ, గుండ్లపల్లి, చందంపేటతో కలిపి మొత్తం 12 మండలాల్లో సాధారణ వర్షం కురిసింది. కాగా వేములపల్లి, మిర్యాలగూడ, తిరుమలగిరిసాగర్, పెద్దవూర, నేరేడుగొమ్ము, గట్టుప్పల మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైంది.



ఊట్కూరు వద్ద కాజ్‌వేపై వరదను పరిశీలిస్తున్న శాలిగౌరారం తహసీల్దార్, ఊట్కూరు సర్పంచ్

పంటల సాగు ఇలా.

ప్రస్తుత వానాకాలం సీజన్‌లో వరి 5.25లక్షల ఎకరాలు, పత్తి 6.50 లక్షల ఎకరాలతోపాటు ఇతర పంటలన్నీ కలిపి మొత్తం 11.93లక్షల ఎకరాల్లో పంటల సాగు కానున్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది. వానలు సరైన సమయంలో కురవకపోవడంతో వారం క్రితం వరకు వరినాట్లు 70,045 ఎకరాల్లో వేసుకోగా పత్తి 5,79,428 ఎకరాలతోపాటు మిగతా పంటలు కలిపి మొత్తం 6,61,328 ఎకరాల్లో మాత్రమే పంటలు సాగయ్యాయి.

వర్షం కురిసిందిలా..

జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు 36.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా శాలిగౌరారం మండలంలో 8.6 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అలగే నకిరేకల్‌లో 69.1 మి.మీ., కట్టంగూర్‌లో 63.8, నార్కట్‌పల్లిలో 60.1 కేతేపల్లిలో 58.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.చిట్యాలలో 50.3, తిప్పర్తితో 48.2, నల్లగొండ 46.0, మునుగోడు 42.7, మాడుగుపల్లి 40.8, చింపత్తపల్లి 38.4, కనగల్ 37.3, మర్రిగూడ 36.9, చండూరు 36.1, నాంపల్లి 34.3, గుండ్లపల్లి 32.8, మిర్యాలగూడ 31.2, త్రిపురారం 30.9, చందంపేట 30.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అనుములహాలియా 26.4, నిడమనూరు 26.3, దామరచర్ల 24.7, గుర్రంపోడు 24.3, దేవరకొండ 22.6, నేరడుగొమ్ము 22.3, కొండమల్లెపల్లి 22.2, వేములపల్లి 19.0, తిరుమలగిరిసాగర్ 18.9, గట్టుప్పల 18.5, పీఏపల్లి 18.4, అడవిదేవులపల్లి 17.7, పెద్దవూర 15.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.



నార్కట్‌పల్లి మండలం ఏడుమోట్లబావి చెరువు అలుగు పారడంతో అమ్మనబోలు-శాలిగౌరారం రోడ్డుపై ప్రవహిస్తున్న వరద

ముమ్మరంగా సాగు పనులు..

ప్రస్తుతం ఉపరితల ఆవర్తనం కారణంగా వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు భూగర్భజలాలు పెరిగి బోర్లు పోస్తుండడంతో పాటుగా పొలాలు దున్నుకోవడానికి వర్షం నీరు అనుకూలంగా ఉండడంతో రైతులు వరినాట్లతోపాటు ఇతర పనులను ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. ఈ వర్షాలతో ఇప్పటి వరకు 1,24,269 ఎకరాల్లో వరి, 5.97లక్షల ఎకరాల్లో పత్తితోపాటు ఇతర పంటలు కలిపి మొత్తం 7,17,516 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. రానున్న రెండు మూడు రోజుల్లో కూడా అధిక వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా వరినాట్లు ఊపందుకునే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- వాతావరణ శాఖ హెచ్చరికలను నిర్లక్ష్యం చేయొద్దు
- కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి జగదీష్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు, కలెక్టర్, అదనపు కలెక్టర్

నల్లగొండ: రాబోయే 48 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో జిల్లా అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆదేశించారు. గురువారం సాయంత్రం నల్లగొండ కలెక్టరేట్‌లో నల్లగొండ, నకిరేకల్ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, కలెక్టర్ కర్ణన్‌తో కలిసి పది రోజులుగా కురుస్తున్న వర్షాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు వస్తే ఏయే ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు జరిగే అవకాశం ఉందో గుర్తించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలను నిర్లక్ష్యం చేయొద్దన్నారు. సూర్యాపేట, నల్లగొండ జిల్లాలో వర్షాల పట్ల గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలన్నారు. వర్షం తీవ్రతను గుర్తించి అవసరమైన చోటు రాకపోకలు కూడా నిలిపివేయాలని ఆదేశించారు. రాబోయే 24 గంటల్లోనే వర్షం పడే అవకాశం ఉంది కాబట్టి అంతా జాగ్రత్తగా ఉండాలని అన్నారు. కేతేపల్లి మండల పరిధిలోని మూసీ ప్రాజెక్టుకు హైదరాబాద్, ఇతర ప్రాంతం నుంచి కూడా వరద వస్తున్నందున అక్కడ కూడా అధికారులను నీటిని ఎప్పటికప్పుడు దిగువకు వదిలేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నల్లగొండ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, అదనపు కలెక్టర్లు, ఖుష్బూగుప్తా, జె.శ్రీనివాస్, ఆర్డీఓ రవి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండలరావు
- మిర్యాలగూడ పట్టణంలో మూడు ప్రైవేట్ ఆస్పత్రులు సీజ్



మిర్యాలగూడలో అనిత ఆస్పత్రిని సీజ్ చేస్తున్న వైద్యాధికారులు

మిర్యాలగూడ అర్బన్: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహించే ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావు హెచ్చరించారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గుర్తింపు లేని మూడు ఆస్పత్రులను సీజ్ చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్స్ కాలనీలో గల అనిత మల్టీ స్పెషాలిటీ, సేఫ్ ఆస్పత్రులకు గుర్తింపు లేకపోవడంతో పాటు డాక్టర్లు లేరని గుర్తించామని, దీంతో ఆయా ఆస్పత్రులను సీజ్ చేస్తున్నామని తెలిపారు. అదే విధంగా ఇండియన్ ఎక్స్ రే సెంటర్‌తోపాటు నవీన మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలోని ల్యాబ్‌ను ఐసీయూను సీజ్ చేసినట్లు చెప్పారు. ప్రైవేట్ ఆస్పత్రుల్ల నిర్వాహకులు అన్ని అనుమతులు తీసుకోవాలని, రోగులకు వేసే బిల్లుల విషయాన్ని బోర్డుపై ఏర్పాటు చేయాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న మరికొన్ని ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు అందజేశామని, రెండు వారాల్లో తమ పనితీరు మార్చుకోకుంటే వాటినీ సీజ్ చేస్తామన్నారు. ఆయన వెంట డెమో రవి శంకర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కేశా రవి ఉన్నారు.

జీపీ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు, సీఐటీయూ నాయకులు

నల్లగొండ టౌన్: గ్రామ పంచాయతీ (జీపీ) కార్మికులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని.. లేదంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి హెచ్చరించారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు పెద్ద ఎత్తున కలెక్టరేట్ వద్దకు చేరుకొని ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు పీఆర్సీ జీఓ 60 ప్రకారం రూ.19 వేల కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాల, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయకార్యదర్శులుగా నియమించాలన్నారు. తమ సమస్యలపై కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్ చినపాక లక్ష్మీనారాయణ, వివిధ సంఘాల నాయకులు పాలడుగు నాగార్జున, గంజి మురళీధర్, పాలడుగు ప్రభావతి, ఇందూరు సాగర్, పందుల సైదులు, పోతెపాక వినోద్‌కుమార్, బి.నర్సింహ, దండెంపల్లి సత్తయ్య, నారబోయిన శ్రీనివాస్, వెంకటయ్య, యాదయ్య, కానుగు లింగస్వామి, సత్యనారాయణ, ముత్యాలు, సాంబయ్య, అంజయ్య, నర్సింహ, జహీర్, సైదులు, యాదమ్మ, కళావతి, రామలింగయ్య, ఎల్లేష్ పాల్గొన్నారు.


రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న నాబార్డు డీజీఎం మనుష్‌కుమార్ బెహారా

కట్టంగూర్: రైతులు పంటల సాగులో ఆధునిక పద్ధతులను అవలంబించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని నాబార్డు డీజీఎం మనుష్‌కుమార్ బెహారా అన్నారు. కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామపంచాయతీ పరిధిలోని గంగదేవిగూడెం సమీపంలో ఉన్న రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్‌ను గురువారం పది రాష్ట్రాల నాబార్డు అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ నిర్వహిస్తున్న అన్నిరకాల కార్యక్రమాలను పరిశీలించారు. ముఖ్యంగా నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను మార్కెట్ ధర కంటే తక్కువకు రైతులకు అందించటం అభినందనీయమని అన్నారు. నిమ్మకాయల గ్రేడింగ్, ట్రేడింగ్, రెండో రకం నిమ్మకాయలను సోలార్ డ్రయర్ ద్వారా ఎండబెట్టి ఒరుగులు చేసి మార్కెట్ చేయటం గమనించారు. కార్యక్రమంలో నాబార్డు తెలంగాణ ఏజీఎం తపస్‌కుమార్ సాహు, నల్లగొండ డీడీఎం వినయ్‌కుమార్, సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, హార్టికల్చర్ అధికారి విద్యాసాగర్, ఐఆర్‌డీఎస్ అధ్యక్షుడు వాడపల్లి రమేష్, సీఎస్‌ఏ ప్రతినిధి ఒరుగంటి రాంమూర్తి, కంపెనీ చైర్మన్ చెవ్వగోని సైదమ్మ, డైరెక్టర్లు ఉన్నారు.

దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న కొప్పు బాషా

నల్లగొండ టూటౌన్: దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఏపల్లి మండలం వద్దిపట్లలో దళిత మహిళపై అక్కడి సర్పంచ్ దాడిచేసినా ఎందుకు పట్టించుకోలేదన్నారు. గుర్రంపోడు మండలానికి చెందిన లింగస్వామి అనే యువకుడిని పోలీసులే గాయపర్చి అతనిదే తప్పు అని తెల్లకాగితం మీద బలవంతంగా సంతకాలు చేయించుకోవడమేంటని ప్రశ్నించా రు. ఈ ఘటనలపై ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో పోతెపాక సాంబయ్య, గోలి ప్రభాకర్, శ్యామ్, భవానీప్రసాద్, నర్సింహ, సుధాకర్, నరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకట్, జాని పాల్గొన్నారు.

‘లక్ష’ పథకానికి రూ.3కోట్లు

- తాజాగా విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- మిగిలినవి త్వరలోనే వచ్చే అవకాశం
- నిధులన్నీ వచ్చాకే పంపిణీ చేస్తామంటున్న అధికారులు



నియోజకవర్గాలు	మొదటి విడత లబ్ధిదారులు
06	1,800
జిల్లా బీసీ అభివృద్ధి శాఖ వద్ద ఉన్న నిధులు రూ.5కోట్లు (తాజాగా విడుదలైన నిధులతో)	
ప్రభుత్వం నుంచి రావాల్సింది రూ.13కోట్లు	

నల్లగొండ: తెలంగాణ ప్రభుత్వం 14 బీసీ కుల వృత్తిదారులతోపాటు ఎంబీసీ కులాలకు ప్రకటించిన రూ.లక్ష ఆర్థికసాయం పథకానికి తాజాగా రూ.3కోట్ల నిధులు విడుదల చేసింది. జిల్లాకు మొత్తం రూ.18 కోట్ల నిధులు అవసరం ఉన్నాయి. అయితే ఇప్పటికే జిల్లాకు ప్రభుత్వం విడుదల చేసినవి రూ.2కోట్ల నిధులు నిల్వ ఉండగా తాజాగా విడుదల చేసిన రూ.3 కోట్లతో కలుపుకొని మొత్తం రూ.5కోట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖలో ఉన్నాయి. ఇంకా రూ.13 కోట్లు రావాల్సి ఉంది. ఆ నిధులు వస్తేనే బీసీలకు రూ.లక్ష ఆర్థికసాయం పంపిణీ చేస్తామని అధికారులు అంటున్నారు.

మొదటి విడత 1,800 మందికి..

రూ.లక్ష ఆర్థికసాయం పథకానికి జిల్లా వ్యాప్తంగా 40,805 మంది బీసీలు, ఎంబీసీలు దరఖాస్తు చేసుకున్నారు. అందులో మొదటి విడతగా 11,267మంది అర్హులుగా తేల్చారు. వీరిలో జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు ఒక్కోదానికి 300 చొప్పున మొత్తం 1,800 మందికి మాత్రమే రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు.

అందరికీ ఒకేసారి పంపిణీ చేయాలని..

ప్రస్తుతం జిల్లా అధికారుల వద్ద ఉన్న రూ.5 కోట్ల నిధులను జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు పంచితే ఒక్కో నియోజకవర్గంలో 83 మందికి మాత్రమే రూ.లక్ష ఆర్థికసాయం అందనుంది. అలా పంపిణీ చేస్తే లబ్ధిదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందన్న ఉద్దేశంతో అధికారులు అందరికీ ఒకేసారి ఇవ్వాలని భావిస్తున్నారు. దీంట్లో భాగంగానే మిగిలిన రూ.13 కోట్ల నిధులు విడుదలైన తర్వాతే మొదటి విడతలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు పంపిణీ చేయాలని నిర్ణయించారు.

నేడో రేపో విడుదలవుతాయి

“ బీసీ ఆర్థికసాయం పథకానికి సంబంధించి ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ నిధులు రూ.13కోట్లు నేడో రేపో విడుదలయ్యే అవకాశం ఉంది. నిధులు విడుదల కాగా పంపిణీ ప్రారంభిస్తాం. నల్లగొండ, నకిరేకల్ నియోజకవర్గాల నుంచే అర్హుల జాబితాలు జిల్లా అధికారులకు అందాయి. ఇంకా నాలుగు నియోజకవర్గాల జాబితాలు అందాల్సి ఉంది.

– నాజీం, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి, నల్లగొండ

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో మేకల కాపరి మృతి


వెంకటేశ్వర్లు మృతదేహం

మోతె: విద్యుదాఘాతంతో మేకల కాపరి మృతిచెందిన ఘటన మోతె మండల పరిధిలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాఘవాపురం ఎక్స్ రోడ్డు గ్రామానికి చెందిన ఇరిగి వెంకటేశ్వర్లు(30) గురువారం ఉదయం తన మేకలను ఇంటి నుంచి తోలుకొని వెళ్లి వ్యవసాయ క్షేత్రంలో మేపుతున్నాడు. ఈ సమయంలో మేకలకు మేత కోసం చెట్టు కొమ్మలు నరుకుతుండగా పక్కనే ఉన్న ఫెన్సింగ్‌కి తగలగా.. దానికి కరెంట్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు గమనించి మృతుడి కుటుంబ సభ్యులకు విషయం తెలియజేయడంతో వారు పోలీసులు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బుద్ధవనం ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటిచెబుతా

- బాలీవుడ్ నటుడు గగన్‌మాలిక్


గగన్‌మాలిక్‌కు మెమొంటో అందజేస్తున్న బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య

నాగార్జునసాగర్: బుద్ధవనం తనను ఎంతగానో ఆకట్టుకుందని, బుద్ధవనం ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటిచెపుతానని బాలీవుడ్ నటుడు, మాజీ క్రికెటర్ గగన్‌మాలిక్ అన్నారు. నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లెపల్లి లక్ష్మయ్య ఆయనను ప్రత్యేకంగా ఆహ్వానించి, సన్మానించారు. సిద్దార్థ గౌతమ అనే చిత్రంలో నటించి ఉత్తమ నటుడిగా అవార్డు పొందడమే గాక, జీ టీవీ రామాయణం సీరియల్‌లోని రాముని పాత్రలో రాణించినట్లు తెలిపారు. బుద్ధవనంలోని జాతకవనం, ధ్యానవనం, శ్రీలంక బుద్ధవిగ్రహం, స్థూపవనం, మహాస్థూపం చుట్టూ అలంకరించిన బౌద్ధ శిల్పాల గురించి బుద్ధవనం కన్సల్టెంట్ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి గగన్‌మాలిక్‌కు వివరించారు. బుద్ధవనంలో చిత్రాలు తీయడానికి బాలీవుడ్, టాలీవుడ్ నిర్మాతలతో చర్చిస్తానని గగన్‌మాలిక్ పేర్కొన్నారు. వారి వెంట కార్యక్రమంలో బుద్ధవనం ఓఎస్డీ సుధీర్‌రెడ్డి, డిజైన్ ఇంఛార్జ్ శ్యాంసుందర్‌రావు ఉన్నారు.

• వానలు.. వరదలు


యాదగిరిగుట్ట పట్టణంలోని గండి చెరువు నిండి యాదగిరిపల్లిలోని పొలాల్లోకి వెళ్తున్న వర్షం నీరు


గుండాల: అలుగు పోస్తున్న నూనెగూడెం పెద్ద చెరువు


మోటకొండూరు: అమ్మనబోలు-గొలనుకొండ మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్ద వాగు


నూతనకల్: గుండ్లసింగారం బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న పాలేరు వాగు


మోత్కూరు మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న బిక్కేరు వాగు


అర్వపల్లిలోని పోలీస్ స్టేషన్ రోడ్డులో జలమయమైన ఇళ్లు


అడ్డగూడూరు: గోవిందాపురం వద్ద వాగులో కొట్టుకుపోతున్న బైక్‌ను తీస్తున్న స్థానికులు


రాజాపేట: దూదివెంకటాపురం వద్ద కల్వర్టుకు అడ్డంగా బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న పోలీసులు


మోతె: కూడలి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్ద వాగు


తిరుమలగిరి(తుంగతుర్తి): అనంతారంలో ఉధృతంగా ప్రవహిస్తున్న బిక్కేరు వాగు


ఆత్మకూర్(ఎస్): నసింపేట వద్ద వరద ధాటికి కోతకు గురైన తాత్కాలిక రోడ్డు


ఆత్మకూరు(ఎస్)లో శంభుని చెరువు అలుగు పోస్తుండడంతో చేపలు పడుతున్న గ్రామస్తులు


ఆలేరు పట్టణంలోని 11 వార్డులో నీట మునిగిన ఇళ్లు


భువనగిరి మండలం వడపర్తి కత్వ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న రాచకాల్వ

మూసీ ప్రాజెక్టుకు భారీగా ఇన్‌ఫ్లో


మూసీ ప్రాజెక్టు ఎనిమిది గేట్లు ఎత్తడంతో దిగువకుపోతున్న నీరు

- ఎనిమిది గేట్ల ద్వారా నీటి విడుదల

కేతేపల్లి: హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో మూసీ ప్రాజెక్టుకు భారీగా ఇన్‌ఫ్లో వస్తోంది. గురువారం ఉదయానికి ప్రాజెక్టుకు 25,489 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో పెరిగింది. అధికారులు ఎనిమిది క్రస్టు గేట్లను ఐదు అడుగుల మేర పైకెత్తి 25,207 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా ఆయకట్టు భూములకు 282 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వచ్చి చేరుతుండటంతో అధికారులు ప్రాజెక్టు వద్దే మకాం వేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. మూసీ రిర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.89 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- వారం రోజుల్లో ఆస్ట్రేలియాకు.. ఇంతలోనే ప్రమాదం
- తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిన మరో యువ డాక్టర్
- బైక్‌పై వెళ్తుండగా ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం


సట్టు మహేష్ (ఫైల్)

నల్లగొండ క్రైం: మరో వారం రోజుల్లో ఉన్నత చదువుల కోసం ఆస్ట్రేలియాకు వెళ్లాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఇదే ప్రమాదంలో మరో యువ డాక్టర్ తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లాడు. ఈ ఘటన బుధవారం రాత్రి నల్లగొండ పట్టణంలోని సాగర్ రోడ్డులో వైఎస్ఆర్ సర్కిల్ వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. శాలిగౌరారం మండలం వల్లాల గ్రామానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ సట్టు సైదులు, నాగమణి దంపతులు ఉద్యోగ రీత్యా నల్లగొండ పట్టణంలోని పద్మావతి కాలనీలో అద్దెకు ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. పెద్ద కుమారుడు సట్టు మహేష్(25) ఉన్నత చదువుల నిమిత్తం ఆస్ట్రేలియాకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. మహేష్‌కు పట్టణంలోని బోయవాడకు చెందిన బత్తుల ముత్యాల్‌రావు కుమారుడు రాజు చిన్నప్పటి నుంచి స్నేహితుడు. రాజు చెన్నైలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. మహేష్, రాజు ఇద్దరూ కలిసి బుధవారం రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై నల్లగొండ పట్టణ శివారులోని సాగర్ రోడ్డులో ఉంటున్న తమ స్నేహితుడి వద్దకు వెళ్లి రాత్రి 9గంటల సమయంలో తిరిగి నల్లగొండ పట్టణంలోకి వస్తున్నారు. అదే సమయంలో వైఎస్ఆర్ సర్కిల్ వద్ద గుర్తుతెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టగా.. మహేష్ డివైడర్‌పై పడడంతో తలకు తీవ్రగాయమై అవస్మారక స్థితిలోకి వెళ్లాడు. బైక్ నడుపుతున్న రాజు తలకు తీవ్రగాయాలు కాగా అతడు వెంటనే తేరుకొని రోడ్డు వెంట వచ్చే వాహనాలను ఆపుతుండగా.. వారి వెనకే వచ్చిన వాహనదారుడు రోడ్డు అడ్డంగా నిలబడి వాహనాలను ఆపసాగాడు. అదే సమయంలో ఓ కారు డ్రైవర్ వారిని గుర్తించి హుటాహుటిన పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. కాగా అప్పటికే మహేష్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడిన రాజు కోమాలోకి వెళ్లగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

మరో వారంలో జీవితంలో స్థిరపడే వారు..

మరో వారంలో మహేష్ ఉన్నత చదువుల నిమిత్తం ఆస్ట్రేలియాకు వెళ్లేందుకు అంతా సిద్ధం చేసుకున్నాడు. చెన్నైలో వైద్య విద్యను పూర్తిచేసిన బత్తుల రాజు సైతం మరో వారం రోజుల్లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఉద్యోగంలో చేరాల్సి ఉంది. చేతికందొచ్చిన కుమారుడు మృతిచెందడంతో మహేష్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోస్టుమార్టం అనంతరం స్వ గ్రామం వల్లాలలో మహేష్ అంత్యక్రియలు నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నగదు చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

- రూ. 14 లక్షల నగదు, స్కూటీ స్వాధీనం చేసుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర


నిందితుడు వెంకటేష్


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేష్‌చంద్ర

భువనగిరి, బొమ్మలరామారం: కారులో పెట్టిన రూ.14లక్షలు దొంగిలించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర భువనగిరి పట్టణంలోని డీసీపీ క్యాంపు కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మలరామారం మండలం మల్యాల గ్రామానికి చెందిన దొమ్మాటి శంకర్ బొమ్మలరామారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రైవేట్ కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. అతడి వద్ద ఇదే మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన తుడుం వెంకటేష్ పనిచేస్తున్నాడు. వెంకటేష్ ప్రతిరోజు శంకర్ ఇంటికి వెళ్లి మధ్యాహ్నం భోజనం తీసుకువస్తుంటాడు. ఇటీవల శంకర్ తనకు సంబంధించిన 20 గుంటల భూమిని హైదరాబాద్‌కు చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తికి విక్రయించాడు. భూమిని కొనుగోలు చేసిన వ్యక్తి బుధవారం ఉదయం శంకర్‌కు రూ.14 లక్షలు నగదు తెచ్చి ఇచ్చాడు. నగదును తీసుకున్న శంకర్ కార్యాలయం ఆవరణలో ఉన్న తన కారు డిక్కీలో పెట్టి తాళం వేసుకున్నాడు. ఇదంతా గమనించిన వెంకటేష్ రోజుమాదిరిగా మధ్యాహ్నం భోజనం తీసుకురావడం కోసం శంకర్ ఇంటికి వెళ్లాడు. ఈ సమయంలో భోజనంతో పాటు ఇంట్లో ఉన్న కారు డూప్లికేట్ తాళాన్ని తీసుకొని కార్యాలయానికి వచ్చి భోజనాన్ని ఇచ్చాడు. అనంతరం కార్యాలయ ఆవరణలో ఉన్న కారు వద్దకు వెళ్లి తన వెంట తెచ్చుకున్న డూప్లికేట్ తాళంతో కారు డిక్కీని ఓపెన్ చేసి అందులో ఉన్న రూ. 14లక్షల నగదును దొంగిలించి తన స్కూటీలో పెట్టుకుని అక్కడి నుంచి పారిపోయాడు. సాయంత్రం విధులు ముగించుకొని శంకర్ కారు వద్దకు వచ్చి చూడగా డిక్కీలో నగదు కనిపించలేదు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు గురువారం రంగాపురం గ్రామ చౌరస్తా వద్ద వెంకటేష్‌ను పట్టుకొని విచారించగా తానే దొంగతనం చేసినట్లు అంగీకరించాడు. నిందితుడి వద్ద రూ.14లక్షల నగదుతో పాటు స్కూటీని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు. 24 గంటల్లోనే ఈ కేసును ఛేదించిన ఎస్‌హెచ్‌ఓ ఏఎస్పీ శివం ఉపాధ్యాయను డీసీపీ అభినందించారు. సమావేశంలో రూరల్ సీఐ బి. సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతోనే ప్రైవేట్ బస్సులో చోరీ

- రూ.28లక్షలు చోరీ చేసేందుకు ముందస్తుగానే ప్లాన్ చేసిన నిందితులు
- బస్సు కోసం ముందుగానే కారులో వచ్చి హోటల్ వద్ద ఎదురుచూపు
- చోరీ చేసిన నగదు బ్యాగులను మరో ఆర్టీసీ బస్సులో హైదరాబాద్‌కు తరలింపు
- హోటల్ వద్ద సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలు

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి శివారులో జాతీయ రహదారి పక్కన ఓ హోటల్ ముందు నిలిపిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో నుంచి బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు రూ.28లక్షలు చోరీ చేసిన విషయం తెలిసిందే. అయితే పక్కా ప్రణాళికతోనే నిందితులు ఈ చోరీకి ప్లాన్ చేసినట్లు హోటల్ వద్ద సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాల ద్వారా తెలుస్తోంది. వివరాలు.. హైదరాబాద్ శివారు మైలార్‌దేవ్‌పల్లి పరిధిలోని కృష్ణాకాలనీ చెందిన సుశాంత్‌కుమార్ పాండా తాను నిర్వహించే ప్లాస్టిక్ సామగ్రి వ్యాపారంలో భాగంగా ఇటీవల ఒరిస్సా రాష్ట్రంలోని బరంపూర్ ప్రాంతానికి వెళ్లి తనకు రావాలస్సిన రూ.28లక్షలను వసూలు చేసుకోని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో హైదరాబాద్‌కు బయల్దేరాడు. మార్గమధ్యలో బుధవారం ఉదయం 8గంటల సమయంలో బస్సు డ్రైవర్ నార్కట్‌పల్లి మండలం గోపలాయపల్లి సమీపంలో హైవే పక్కన గల పూజిత హోటల్ వద్ద టిఫిన్ కోసం బస్సును నిలిపాడు. డబ్బు ఉన్న రెండు బ్యాగులను బస్సులోనే తన సీట్లో ఉంచిన పాండా టిఫిన్ చేసేందుకు కిందకు దిగాడు. కొద్దిసేపటి తర్వాత వచ్చి చూసేసరికి డబ్బు ఉన్న బ్యాగులు కనిపించకపోవడంతో బస్సు డ్రైవర్, హోటల్ యజమాని సహకారంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకొని బస్సు డ్రైవర్, బస్సును పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి అందులో ప్రయాణిస్తున్న 27మందిని విచారించారు. హోటల్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో నిందితుల దృశ్యాలు రికార్డయ్యాయని, వారిని పట్టుకునేందుకు 4టీంలతో గాలిస్తున్నట్లు ఎస్ఐ సైదాబాబు తెలిపారు.

సీసీ కెమెరాల్లో చోరీ దృశ్యాలు..

కాగా సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాల ప్రకారం.. బస్సు హోటల్ వద్దకు వచ్చే కంటే కొంచెం ముందే ఓ కారు అక్కడకు వచ్చింది. ఆ తర్వాత ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు హోటల్ వద్దకు రాగా.. అందులోని ప్రయాణికులు దిగిన తర్వాత కారులోని ముగ్గురు వ్యక్తుల్లో ఒకరు బస్సులోకి వెళ్లి రెండు బ్యాగులను బయటికి తీసుకొచ్చి విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఆపి అందులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తికి రెండు బ్యాగులు ఇచ్చాడు. ఆ తర్వాత కారులో వచ్చిన వారు హైదరాబాద్ వైపు వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది.

గతంలోనూ ఇలాంటి ఘటనలు..

→ పూజిత హోటల్ వద్దే గతంలోనూ ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో నుంచి 130 తులాల బంగారం చోరీ జరిగింది. 22 నవంబర్, 2022న చెన్నై నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ అల్పాహారం కోసం పూజిత హోటల్ వద్ద ఆపగా.. ప్రయాణికులు దిగిన తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు బస్సులోకి చొరబడి అందులో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడికి చెందిన 130 తులాల బంగారం చోరీ చేశారు.

→ అదేవిధంగా 4 జూలై, 2019న నిజామాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు విజయవాడ నుంచి హైదారాబాద్ వెళ్తుండగా.. డ్రైవర్ పూజిత హోటల్ వద్ద అల్పాహారం కోసం ఆపాడు. ప్రయాణికులు దిగిన తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు బస్సులోకి వెళ్లి రూ.10లక్షల నగదు బ్యాగును చోరీ చేశారు. కాగా ఈ రెండు ఘటనల్లో పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ.. అప్పట్లో ఆ హోటల్ వద్ద సీసీ కెమెరాలు లేకపోవడంతో నిందితులను ఇప్పటివరకు గుర్తించలేదని తెలుస్తోంది.

యాదాద్రిని సందర్శించిన బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్


డిప్యూటీ హై కమిషనర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న అధికారి

సాక్షి, యాదాద్రి, యాదగిరిగుట్ట : బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఒవెన్ గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌ను సందర్శించారు. కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి పరిపాలన గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించి మొక్కను అందజేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు జిల్లాలో అమలవుతున్న తీరును హై కమిషనర్‌కు కలెక్టర్ పమేలా సతప్పతి వివరించారు. అనంతరం బ్రిటీష్ హైకమిషనర్ గారెత్ విన్ ఒవెన్ యాదగిరిగుట్టకు వెళ్లి యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.